క్లుప్తంగా

నేడు ఇంటర్వ్యూ

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులకు ఈనెల 31వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్‌సైన్స్, ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, ఎంటెక్ డేటాసైన్స్‌లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్/సెట్/స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. డెమో క్లాస్, ఇంటర్వ్యూ, స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా 3 మెన్ కమిటీ ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్‌లకు పదోన్నతులు



కౌన్సెలింగ్ చేపడుతున్న ఆర్డీ రత్నకుమారి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో మంగళవారం స్థానిక ఆ కార్యాలయంలో హెల్త్ సూపర్‌వైజర్(ఎఫ్)లకు పీహెచ్‌ఎన్ (ఎన్‌టీ)గా పదోన్నతుల కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 23 మందికి గాను 17 మంది పదోన్నతులు స్వీకరించారు. నిబంధనలు, ఉద్యోగుల సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ వినీష పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్‌వీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేసీ.పాములేటి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు, సుమంత్, చిన్న తదితరులు పాల్గొన్నారు

ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట నిరసన



ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా విధులకు డుమ్మా కొట్టి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఈఓ, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం కడప ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మాజీ ఆర్‌జేడీ రాఘవరెడ్డిపై జరిగిన విచారణ సందర్భంగా కడప డీఈఓ కార్యాలయం వద్ద ఒక ఉపాధ్యాయుడిపై ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు దాడి చేశారన్నారు. ఈ విషయమై కడప చిన్నచౌకు పోలీసు స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయ్యాయన్నారు. వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్‌జేడీ కార్యాలయ ఏడీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జస్వంత్, అబ్బాస్, అలీ, ఆరీఫ్, సురేష్, మధు పాల్గొన్నారు.

నిషేధాన్ని ఎత్తివేయాలి



ఉప ఖజానా శాఖ అధికారికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ / కడప ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులు తమ కాంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా ఉప ఖజానా శాఖాధికారి వెంకటేశ్వర్లును ఆయన చాంబర్లో కలిసి అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు తమ జీతం నుండి కాంట్రిబ్యూషన్‌గా చెల్లించిన సొమ్ములో 25 శాతం వ్యక్తిగత, అనారోగ్య అవసరాలకు ఉపయోగించుకోవడానికి అవకాశం ఉందని, ఆ సొమ్ములు పొందడానికి ప్రస్తుతం ఖజానాశాఖ నిషేధం విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చాలామంది సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థిక అవసరాల కోసం లోన్ ద్వారా తీసుకోవాలనుకున్న సొమ్మును విడుదల చేయకుండా నిషేధించడం మంచిది కాదన్నారు. వెంటనే పాక్షిక ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమబాట పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం





కడప రిమ్స్ ప్రధాన రోడ్డు నుంచి శివానందపురం వెళ్లే మార్గం ఫుట్‌పాత్ ప్రమాదకరంగా మారింది. ఈ ఫుట్‌పాత్‌పై ఒక భాగం తొలగిపోవడంతో అక్కడ పెద్ద డ్రైనేజీ కాలువ ప్రమాదంను సూచిస్తోంది. ఈ ఫుట్‌పాత్‌పై పాదచారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో వాకింగ్‌కు పలువురు వస్తుంటారు. ఇప్పటికే ఇక్కడ పలువురు డ్రైనేజీ కాలువలో పడి గాయపడ్డారని స్థానికులు తెలిపారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– కడప రూరల్

విద్యార్థులకు ఉర్దూ పుస్తకాలు అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం కడప నగరం అఫ్సర్ ఖాన్ కాలనీలోగల కార్యాలయంలో హిదాయతుల్లా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శాఖపరమైన నిర్ణయాలు చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలపై నిర్ణయం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ జిల్లా కార్యదర్శి ఇషాక్ అలీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ విద్యార్థులకు ఉర్దూ పుస్తకాలు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, వీటిపైన స్థానిక ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉర్దూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రెజరర్ బహుద్దీన్ సుల్తాన్ మోదీ, కరిముల్లా, జిలాన్, క్వాలిటీ ఇస్మాయిల్, సికిందర్ హుస్సేన్, మక్బుల్ బాష తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నేటి యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. మంగళవారం కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలను ఆయన పరిశీలించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతుల అక్రమ రవాణా, ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. హెల్మెట్ ధారణ, పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు తదితర అంశాలపై వైద్య విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులపై కేసు నమోదైతే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. అంతకుముందు న్యాయమూర్తి ఆస్పత్రిలోని పలు వార్డులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, దిశ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, ఫాతిమా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ, డైరెక్టర్ డాక్టర్ యు.జయరామిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, లీగల్ వలంటీర్లు శ్రీనివాసరావు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు

– ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: ఏఆర్ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఏఆర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పారదర్శకంగా విధులను నిర్వర్తించాలనీ ఆదేశించారు. ఈ సందర్భంగా గార్డు విధులు, ఎస్కార్ట్ విధులు, వ్యక్తిగత భద్రతా అధికారులకు (పి.ఎస్.ఓ) నిర్వహించే సిబ్బంది వివరాలు ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న డ్రైవర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం కడప ఆర్టీసీ గ్యారేజీలో 200 టేకు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కడప డిపో పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లచే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొక్క డ్రైవర్ మొక్కను నాటడమే కాకుండా వాటి సంరక్షణ చేపట్టాలా చర్యలు చేపడుతున్నామన్నారు. మొక్క చెట్టుగా మారే వరకు సంబంధిత డ్రైవరే బాధ్యత వహించాలని ఆయన సూచించారు. మానవ మనుగడకు మొక్కలే ఆధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

శిలాఫలకంలో తప్పులు సరిదిద్దేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుడు కోటిరెడ్డి విగ్రహ శిలాఫలకంపై దొర్లిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శివశంకర్ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు. 'శిలాఫలకంలో అచ్చు తప్పులు' అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేశు యాదవ్ మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కోటిరెడ్డి 1981లో కన్నుమూయగా, శిలాఫలకంలో మాత్రం 1957లో అంటూ తప్పుగా నమోదు చేశారని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేది స్వాతంత్ర్య దినోత్సవానికంతా ఈ తప్పులను సరిదిద్దాలని కోరడంతో కలెక్టర్ పై విధంగా స్పందించారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల షెడ్యూలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరిగి మూడేళ్లు కావస్తున్నా అవే కమిటీలు కొనసాగుతూ ఉన్నాయని వెంటనే నూతన ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సి వి ప్రసాద్ , చంగల రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, ఆలీ ఖాన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కమిటీలను ఎన్నుకునేలా విద్యాశాఖ చర్యలు చేపట్టాలన్నారు. విద్య పథకాలకు సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం , డొక్క సీతమ్మ లాంటి మహనీయులను స్మరించుకుంటూ పేర్లు పెట్టడం అభినందనీయమని అన్నారు. కానీ బీసీ వర్గానికి చెందిన సావిత్రిబాయి పూలే పేరు అనుబంధ పథకాలకు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాయలసీమ కళా ప్రతిభకు ప్రతీక 'పులికంటి'

కడప కల్చరల్ : రాయలసీమ సాహిత్య కళా ప్రతిభకు పులికంటి కృష్ణారెడ్డి ప్రతీకగా నిలిచారని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం డాక్టర్ పులికంటి 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలు త ఆయన చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ ఆయన రాసిన కథలన్నీ సీమ పరిమళంతో విశేషమైన పేరు ప్రఖ్యాతులు గడించాయని, దాదాపు 200కు పైగా కథలు రాసి వాటిలో కొన్నింటిని కథా సంపుటాలుగా వెలువరించారన్నారు. సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నకాష్ వీధిలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్: కడప నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్థానిక తిలక్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చిన్నచౌక్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక ఉత్సవం



విశేష అలంకారంలో శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి

కడప కల్చరల్ : ఆడికృత్తిక పర్వదినాన్ని మంగళవారం కడప నగరంలోని పలు దేవాలయాలలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి, శ్రీ సోమ సుందరేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకలు నిర్వహించారు.

– కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు.

– కొత్త కలెక్టరేట్ కూడలిలోగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి మందిరంలో ఆడికృత్తిక ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మార్నింగ్ విజిట్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ రాకేష్ చంద్రం

కడప కార్పొరేషన్: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్ రాకేష్ చంద్రం ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన శంకరాపురం, ఎన్‌జీవో కాలనీ, మృత్యుంజయకుంట, కోటిరెడ్డి సర్కిల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్మికులకు కేటాయించిన ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్జీవో కాలనీలో పెద్ద కాలువలను మలేరియా విభాగం కార్మికులతో శుభ్రం చేయించాలన్నారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కాలువలో వ్యర్థాలను తక్షణం తొలగించాలన్నారు. ఆ తర్వాత ఖలీల్‌నగర్, అబ్దుల్ నబీ వీధి, నకాష్ ప్రాంతాలను పరిశీలించి పారిశుధ్య పనుల నిర్వహణపై సూచనలు చేశారు. గాంధీ ప్లాజాలో జరుగుతున్న పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, ఈఈ ధనలక్ష్మి, డీఈ వేణుగోపాల్, ఏఈలు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పూజలు

కడప కల్చరల్: స్థానిక చిన్న బెస్తవీధిలోని శ్రీ బాల పోలేరమ్మ ఆలయంలో మంగళవారం రాహుకేతు తదితర నవగ్రహ దోషాల నివారణ కోసం ప్రత్యేకంగా అమ్మవారికి రాహుకేతు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3.00 నుంచి 4.30 గంటల వరకు అర్చకులు పూజా విధానాన్ని తెలియజెప్పి కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంబేద్కర్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలో ఉన్న అంబేద్కర్ భవనాన్ని దళితులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జాకట విజయ్ శేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కడపలో ఉన్న అంబేద్కర్ భవనం గత కొంత కాలంగా ఎటువంటి ఉపయోగం లేకుండా ఉందని.. ఆ భవనాన్ని దళితులకు ఉపయోగపడేలా చూడాలని జేసీని కోరారు. అంతేకాకుండా ప్రస్తుతం రిమ్స్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ భవనం కూడా ఉపయోగం లేకుండా ఉందన్నారు. ఆ భవనాన్ని స్వల్ప మరమ్మతులు చేసి దళిత జాతికి అందచేస్తే దళిత జాతి కార్యక్రమాలు, మీటింగులు, ప్రెస్ మీటింగులు, వివాహాలు జరుపుకునేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరు సురేష్, కడప జిల్లా అధ్యక్షులు భాస్కర్, కడప నగర అధ్యక్షులు చెంచుల డేవిడ్ సత్యారాజ్, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు దీపక్, ప్రొద్దుటూరు మండల ఉపాధ్యక్షులు అకుమల్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వనరులను వినియోగించుకోవాలి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉన్న వనరులను ప్రభావవంతంగా వినియోగించేలా ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పని చేయాలని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సాయంత్రం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో సురక్షిత నీరు, సోలార్ నుంచి లభించే విద్యుత్తు గురించి ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. అలానే నిర్మాణాలపై, అందుకు తగ్గ వ్యయం గురించి, ఉన్న వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు, అధ్యాపకులు సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇంజనీరింగ్ శాఖ చూడాలని సూచించారు. విద్యాలయ అవసరాలను ఇంజనీరింగ్ అధికారులు వీసీ దృష్టికి తెచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జయరామిరెడ్డి, ఆచార్య జయచంద్రారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పాలకొండల వద్ద చెక్‌పోస్టు పెట్టాలి

కడప కల్చరల్ : కడప నగరానికి అత్యంత సమీపంలో గల ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన పాలకొండల వద్ద రాష్ట్ర దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిద్దలూరి రమేష్, తాళపత్ర గ్రంథ పరిశోధకులు నాగదాసరి మునికుమార్‌లు కోరారు.

మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను ఆమె చాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. పాలకొండలకు సాధారణ రోజుల్లో కూడా పర్యాటకులు వెళతారని, ఎలాంటి అడ్డు అదుపు లేకపోవడంతో అక్కడ మద్య వినియోగం ఎక్కువగా ఉందని, దాంతో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకునే ప్రమాదముందని వారు వినతి పత్రంలో కోరారు. నాలుగు రోజుల్లో శ్రావణ మాసం రానుండడంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య పెద్దగా ఉంటుందని, కాబట్టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందే కొండ కింద ఆర్చి వద్దనే పోలీసు చెక్ పోస్టును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెల రామాంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.